ఎక్కడి చెత్త అక్కడే..



రిక్షాకాలనీ నుంచి టీచర్స్‌కాలనీకి వెళ్లే మార్గంలోని రిమ్స్ ఆస్పత్రి వెనుక భాగాన ఉన్న స్థలంలోనివి. ఇళ్లలో పోగైన చెత్తను ఆయా కాలనీవాసులు ఇష్టారాజ్యంగా తెచ్చిపడేటయంతో ఆ ప్రాంతమంతా అనధికార దంపింగ్‌యార్డును తలపిస్తోంది.



చెత్తతో ఇలా నిండి కనిపిస్తున్న డస్ట్ బిన్‌లు జిల్లా కేంద్రంలోని ద్వారాకనగర్ లోనివి. రోజుల తరబడి చెత్తను శుభ్రం చేయకపోవడంతో ఇలా కిందపడతోంది. రోడ్డుపైకి వస్తున్న స్పందించేవారు లేకపోవడం పరిస్థితికి నిదర్శనం.



రోడ్డుపై చెత్తాచెదారంతో దర్శనమిస్తున్నది పట్టణంలోని బద్కమొహల్లాకాలనీ లోనిది. చెత్తను వాహనాలకు అందించాల్సిన కాలనీవాసులు ఇలా రోడ్డుపై పడేస్తున్నారు. దీంతో ఈదురుగాలులకు చెత్తంతా రోడ్డుపైకి రావడంతోపాటు వాహనదారులకు తీవ్ర ఇబ్బందికరంగా మారుతోంది.

- పారిశుద్ధ్య నిర్వహణ అస్తవ్యస్తం
- పట్టణంలో గాడితప్పిన చెత్త సేకరణ
- రోడ్లపై పడేస్తున్న కాలనీవాసులు
- అనధికార డంపులుగా మారుతున్న ప్రాంతాలు
- ప్రేక్షకపాత్రలో బల్దియా పారిశుద్ధ్య విభాగం

పట్టణంలో..
మొత్తం వార్డులు: 49
కుటుంబాలు: 48,393
రోజు పోగయ్యే చెత్త: 64 మెట్రిక్ టన్నులు
చెత్త సేకరణ ఆటోలు: 47
చెత్త సేకరణ ట్రాక్టర్లు: 13
పారిశుద్ధ్య జవాన్లు: 10

కైలాస్‌నగర్: పట్టణంలో పారిశుద్ధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. ఇంటింటి చెత్త సేకరణ పూర్తిగా గాడి తప్పింది. వివిధ కాలనీల్లో ఎటుచూసిన చెత్తకుప్పలే దర్శనమిస్తున్నాయి. కాలనీలకు రోజుల తరబడి చెత్త వాహనాలు రాకపోవడం, వచ్చిన వాటి వెంట చెత్తను తీసుకునే కార్మికులు ఉండటం లేదు. దీంతో పలు కాలనీల్లోని ప్రజలు తమ ఇళ్లలో పోగైన చెత్తను ఇష్టారాజ్యంగా రోడ్లపై పడేస్తున్నారు. ఇలా పోగైన చెత్తాచెదారంతో పలు ప్రాంతాలు అనధికారి డంపులుగా మారుతున్నాయి. డస్ట్‌బిన్లలో నిండిన చెత్తను సైతం శుభ్రం చేయడం లేదు. దీంతో ఆయా ప్రాంతాల్లో అపరిశుభ్ర వాతావరణం ఏర్పడి దోమలకు నిలయంగా మారుతుంది. ఇదే పరిస్థితి కొనసాగితే ఈ వర్షాకాలంలో సీజనల్ వ్యాధుల తీవ్రత అధికమై ప్రజలు అనారోగ్యబారినపడే ప్రమాదం లేకపోలేదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

గాడి తప్పిన చెత్తసేకరణ

పట్టణంలో విలీన కాలనీలతో కలిపి మొత్తం 49 వార్డులున్నాయి. వీటి పరిధిలో నిత్యం 64 మెట్రిక్ టన్నుల చెత్త పోగవుతుందని బల్దియా అధికారులు చెబుతున్నారు. ఆయా కాలనీల్లో చెత్త సేకరణ సక్రమంగా జరగడం లేదు. తిర్పెల్లి, రిక్షాకాలనీ, శ్రీరాం కాలనీ, కొలిపుర, బద్కమహోల్లా, హౌజింగ్ బోర్డు, ద్వారాకానగర్, భుక్తాపూర్, దస్నాపూర్, రాంనగర్ తదితర కాలనీల్లో చెత్తాచెదారంతో నిండిన కుప్పలు ఎక్కడపడితే అక్కడ దర్శనమిస్తున్నాయి. ఆయా కాలనీలన్నింటికి చెత్త సేకరణ వాహనాలను పంపుతున్నామని చెబుతున్నా చెత్త కుప్పలుగా ఎందుకు పేరుకుపోతుందనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. రిక్షా కాలనీ, ఎంప్లాయిస్ కాలనీ, టైలర్స్ కాలనీల్లోనే సమస్య ఉన్నట్లుగా పేర్కొన్నప్పటికి అన్ని కాలనీల్లో దాదాపు ఇదే పరిస్థితి నెలకొంది. పలు కాలనీలకు చెత్త వాహనాలు రోజుల తరబడి రావడం లేదు. దీంతో నిండిన చెత్తబుట్టల్లోని చెత్తనంతా విధిలేని పరిస్థితుల్లో రోడ్లపై, డ్రెయినేజీల్లో ఇష్టారాజ్యంగా పడేస్తున్నారు. వాటిని శుభ్రం చేయకపోవడంతో కుప్పలుగా పేరుకుపోయి అపరిశుభ్ర వాతావరణానికి కారణమవుతున్నాయి. ఇటీవల ఈదురుగాలులతో కూడిన వర్షానికి చెత్త రోడ్లపై రావడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వచ్చింది.

కరువైన పర్యవేక్షణ

గ్రేడ్-1 స్థాయి కలిగిన ఆదిలాబాద్ మున్సిపాలిటీ పారిశుద్ధ్య విభాగంలో ఇద్దరు శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, ఒక శానిటరీ హెల్త్ సూపర్‌వైజర్ పనిచేస్తున్నారు. పట్టణంలోని 49 వార్డులను మూడు సర్కిళ్లుగా విభజించి చెరో కొన్ని వార్డులను వారు పర్యవేక్షించాల్సి ఉంది. అయితే సదరు అధికారులు కార్యాలయానికే పరిమితమవుతున్నారు తప్ప క్షేత్రస్థాయిలోకి వెళ్లడం లేదనే విమర్శలున్నాయి. బల్దియా ప్రత్యేకాధికారి, జిల్లా ఉన్నతాధికారుల పర్యవేక్షణ పూర్తిగా కొరవడింది. దీంతో పారిశుద్ధ్యాన్ని నిరంతరం పర్యవేక్షించి సమస్య తలెత్తకుండా చూడాల్సిన ఆ విభాగం అధికారులు మొక్కుబడిగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఫలితంగానే ఈ పరిస్థితి ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. వర్షాలు కురుస్తుండటం, ముందు వర్షాకాలం రానుండటంతో పరిస్థితిలో మార్పు రాకుంటే రోగాల తీవ్రత పెరిగే ప్రమాదం లేకపోలేదని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైన అధికారులు ఆదిశగా దృష్టిసారించాలని వారు కోరుతున్నారు.

జవాన్ నిర్వాకంతోనే ఈ పరిస్థితి

సాయి అనే జవాన్ విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ, చెత్త సేకరణ, వాహనాలను పట్టించుకునేవారు కాదు. ఆ జవాన్‌ను విధుల నుంచి తొలగించి మరో జవాన్‌కు బాధ్యతలను అప్పగించాం. మరికొన్ని వార్డుల్లో సమస్య ఎందుకు ఏర్పడుతుందనే దానిపై సమీక్షించి చర్యలు తీసుకుంటాం. పారిశుద్ధ్య పరంగా ఇబ్బంది లేకుండా ప్రతీకాలనీకి రోజు విడిచి రోజు చెత్త సేకరణ వాహనాన్ని పంపిస్తాం.

– బైరి శంకర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్, సర్కిల్-2

క్లుప్తంగా

పారిశుద్ధ్యం, క్లోరినేషన్‌పై దృష్టి సారించాలి



మాట్లాడుతున్న డీపీవో రమేశ్, తదితరులు

నార్నూర్: వర్షాకాలం నేపథ్యంలో గ్రామాల్లో పారిశుద్ధ్యం, క్లోరినేషన్‌పై ప్రత్యేక దృష్టి సారించాలని డీపీవో రమేశ్ అన్నారు. మండల కేంద్రంలోని నార్నూర్, గాదిగూడ మండలాల పంచాయతీ కార్యదర్శులతో మంగళవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీల వారీగా వివరాలను అడిగి తెలుసుకున్నారు. రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పల్లెల్లో వర్షపు నీరు నిల్వ లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. తాగునీటి బావిలో, చేతిపంపులో క్లోరినేషన్ తప్పనిసరిగా చేయాలని సూచించారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎంపీడీవో గంగాసింగ్, ఎంపీవో సాయిప్రసాద్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఇళ్ల మంజూరు పత్రాల పంపిణీ



మంజూరు పత్రాలు అందజేస్తున్న మోహన్‌రెడ్డి

తాంసి: రెండోవిడతలో ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన లబ్ధిదారులకు ఎంపీడీవో మోహన్‌రెడ్డి మంగళవారం మంజూరు పత్రాలు పంపిణీ చేశారు. మండలంలోని జామిడి, బండల్ నాగాపూర్ గ్రామాలకు చెందిన పలువురి లబ్ధిదారులకు పత్రాలు అందజేశారు. అనంతరం ఇళ్ల నిర్మాణ పనులను ప్రారంభింపజేశారు. పంచాయతీ కార్యదర్శులు హమీద్, సౌజన్య మాజీ ఎంపీపీ శ్రీధర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ వెంకన్న తదితరులు ఉన్నారు.

న్యాయం కోసం ఎర్రజెండా పోరాడుతుంది



నినాదాలు చేస్తున్న నాయకులు

బోథ్: న్యాయం కోసం ఎర్రజెండా ప్రజల కోసం పోరాడుతుందని సీపీఐ జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం సీపీఐ మహాజన సభ నిర్వహించారు. ఈసందర్భంగా మండల కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా ఎల్.నరేష్, కార్యదర్శిగా కార్తీక్, సంయుక్త కార్యదర్శిగా మున్సిఫ్, రైతు సంఘం కార్యదర్శిగా భోజన్న, ఐఎల్‌ఓ కార్యదర్శిగా దాసు, సభ్యులుగా కవిత, ఆడెపు కమల, లక్ష్మి, రాజేశ్వర్ ఎన్నికయ్యారు.

ఐటీఐలో ప్రవేశాలకు దరఖాస్తులు

ఆదిలాబాద్‌టౌన్: జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థలో 2025–26 సంవత్సరంలో ప్రవేశాల కోసం దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ పి.శ్రీనివాస్ తెలిపారు. ఇంజనీరింగ్ ట్రేడ్‌లలో శిక్షణ పొందడానికి అభ్యర్థులు ఈనెల 21లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. వెబ్‌సైట్ iti. telangana. gov. inలో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. అభ్యర్థులు 10వ తరగతి ఉత్తీర్ణులై ఉండి 14 ఏళ్ల వయస్సు నిండి ఉండాలని పేర్కొన్నారు. ప్రవేశ రుసుము రూ.100 చెల్లించాల్సి ఉంటుందని, మొబైల్ నంబర్, మెయిల్ ఐడీ, ఆధార్ తప్పనిసరిగా నమోదు చేయాలని పేర్కొన్నారు. గరిష్ఠ వయస్సు లేదని తెలిపారు. వివరాలకు 9493535378 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించాలి



మాట్లాడుతున్న డాక్టర్ సద్దాం

నేరడిగొండ: ఆశవర్కర్లు బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించాలని పీహెచ్‌సీ వైద్యాధికారి సద్దాం అన్నారు. పీహెచ్‌సీలో ఆశ వర్కర్లతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారిశుద్ధ్యం, ఎపిడెమిక్ నియంత్రణ, ప్రసవాలు, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. గ్రామంల్లో పారిశుద్ధ్యం, వ్యాధుల నివారణ కోసం ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. దీంతోపాటు ఆరోగ్య సేవల పట్ల ప్రజల్లో నమ్మకం పెంచేందుకు తీసుకోవాల్సిన చర్యలపై దృష్టి సారించాలన్నారు. సమావేశంలో హెచ్ఈఓ పవార్ రవీందర్, హెల్త్ సూపర్ వైజర్ సంతోష్, స్వర్ణలత పాల్గొన్నారు.

నీటి ఎద్దడి లేకుండా చర్యలు

- ఎమ్మెల్యే పాయల్ శంకర్



పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శంకర్

ఆదిలాబాద్: పట్టణంలో నీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని బంగారుగూడ కాలనీలో ఆరు లక్షల లీటర్ల నీటి సామర్థ్యంతో నిర్మించనున్న ట్యాంక్ నిర్మాణ పనులను మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమృత్‌లో భాగంగా మున్సిపాలిటీ పరిధిలో 8 నీటి ట్యాంకులు మంజూరైనట్లు తెలిపారు. దాదాపు ఐదు ట్యాంకుల పనులు వివిధ దశల్లో ఉన్నాయన్నారు. అదేవిధంగా పైప్ లైన్ నిర్మాణ పనులు పూర్తి చేస్తామన్నారు. అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ సిస్టం నిర్మించేలా కృషి చేస్తామని, రూ. కోట్ల నిధుల వ్యయంతో పట్టణ అభివృద్ధికి ప్రణాళికబద్ధంగా ముందుకు వెళ్తున్నామన్నారు. మున్సిపాలిటీకి అమృత్ పథకం మంజూరు చేసిన ప్రధాని మోదీకి, సీఎం రేవంత్‌రెడ్డి సహకారానికి కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు శ్రీనివాస్ యాదవ్, శ్రీనివాస్, కృష్ణ, అజయ్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

గంజాయి పట్టివేత



పట్టుబడిన గంజాయి

బోథ్: మండల కేంద్రంలోని మార్కెట్‌లో గంజాయి విక్రయిస్తున్న ఇద్దరిని మంగళవారం సాయంత్రం పట్టుకున్నట్లు ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ఆత్రం సోమన్న, సిడం గంగారాంలు గంజాయిని విక్రయించడానికి ప్రయత్నిస్తుండగా పట్టుకున్నట్లు పేర్కొన్నారు. వారి వద్ద నుంచి 150 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకుని, వారిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

భూ సమస్యలు పరిష్కరించుకోవాలి

- ఉట్నూర్ సబ్ కలెక్టర్ యువరాజ్ మర్మాట్



దరఖాస్తులను పరిశీలిస్తున్న యువరాజ్ మర్మాట్

ఇంద్రవెల్లి: రాష్ట్రప్రభుత్వం భూభారతి చట్టంలో భాగంగా గ్రామాల్లో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సుల్లో రైతులు భూ సమస్యలను పరిష్కరించుకోవాలని ఉట్నూర్ సబ్‌కలెక్టర్ యువరాజ్ మర్మాట్ సూచించారు.మండలంలోని ఏమాయికుంట, దనోరా పంచాయతీ కార్యాలయల్లో మంగళవారం రెవెన్యూ సదస్సులను పరిశీలించారు. అధికారులు, రైతులతో మాట్లాడి దరఖాస్తు చేసిన రైతుల వివరాలు, భూసమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలకు రెవెన్యూ అధికారులు వెళ్లి భూమి సంబంధిత సమస్యలను పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. ఈనెల 20 వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుందన్నారు. తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్, డిప్యూటీ తహసీల్దార్ రమేశ్, ఆర్‌ఐ లక్ష్మణ్, మాజీ సర్పంచులు జాదవ్ లఖన్, యేర్మ జాకేశ్వర్, రైతులు ఉన్నారు.

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ అర్బన్ మండల పరిధిలో రెవెన్యూ సదస్సులు ప్రారంభమయ్యాయి. భుక్తాపూర్ శివారులోని వ్యవసాయ భూములకు సంబంధించి పశుసంవర్థక శాఖ కార్యాలయంలో సదస్సు నిర్వహించారు. తహసీల్దార్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో రెవెన్యూ సిబ్బంది ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు అందుబాటులో ఉండి రైతుల సమస్యలను తెలుసుకున్నారు. ఇందులో రెండు పట్టాల్లో మార్పులు, ఒకటి పీఓబీ జాబితా నుంచి తొలగింపు, ఒకటి ఆక్రమణకు సంబంధించి దరఖాస్తులు రాగా, మరో ఏడు ఇతర సమస్యలపై అర్జీలు అందినట్లు ఆయన పేర్కొన్నారు. కాగా, బుధవారం ఖానాపూర్ శివారులోని వ్యవసాయ భూములకు సంబంధించి అక్కడి ఎస్సీ కమ్యూనిటీ హాల్‌లో సదస్సు నిర్వహించనున్నట్లు తెలిపారు.

సాత్నాల: సాంగ్విలో రెవెన్యూ సదస్సులో 10 దరఖాస్తులు అందాయని తహసీల్దార్ విశ్వనాథ్ తెలిపారు. ఆర్‌ఐ సాయిరాం, జూనియర్ అసిస్టెంట్ కోటేశ్వరరావు, రికార్డ్ అసిస్టెంట్ వెంకటేశ్ ఉన్నారు.

తాంసి: రైతుల భూ సమస్యలను పరిష్కరించడానికే ప్రభుత్వం భూభారతి చట్టాన్ని తీసుకువచ్చిందని డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి అన్నారు. గిరిగాం గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా అధికారులు గ్రామస్తులు, రైతులకు భూ భారతి చట్టంపై అవగాహన కల్పించారు. అనంతరం రైతుల నుంచి వివిధ అర్జీలను స్వీకరించారు. తహసీల్దార్ లక్ష్మి, డిప్యూటీ తహసీల్దార్ గణేశ్, ఆర్‌ఐ సంతోశ్, సర్వేయర్ ప్రసాద్, సొసైటీ వైస్ చైర్మన్ ధనుంజయ్, మాజీ సర్పంచ్ గజానన్ ఉన్నారు.

బజార్‌హత్నూర్: ఉమర్ద, దిగ్నూర్ గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. తహసీల్దార్ శ్యాంసుందర్, నాయబ్ తహసీల్దార్ హీరాలాల్, ఎంఆర్‌ఐ నూర్‌సింగ్, సీనియర్ అసిస్టెంట్ విద్యాసాగర్‌రెడ్డి, కరుణకర్‌రెడ్డి, రమేశ్ పాల్గొన్నారు.

తలమడుగు: కోసాయి, రుయ్యాడి గ్రామాల్లో 30 దరఖాస్తులు వచ్చాయని తహసీల్దార్ రాజ్‌మోహన్ తెలిపారు. డిప్యూటీ తహసీల్దార్ ప్రభాకర్, ఆర్‌ఐ రోహిదాస్, సిబ్బంది ఉన్నారు.

జైనథ్: కరింజ, కోడేకొట, నిజాంపూర్‌లో పలువురి నుంచి దరఖాస్తులు స్వీకరించినట్లు తహసీల్దార్ ఆత్రం నారాయణ తెలిపారు. దరఖాస్తులు పరిష్కరించి రైతుల భూ సమస్యలను పరిష్కరిస్తానని పేర్కొన్నారు.

సిరికొండ: లక్మంపూర్‌లో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో తహసీల్దార్ తుకారం, అధికారులు, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

గుడిహత్నూర్: కమలాపూర్‌లో రెవెన్యూ సదస్సులో తహసీల్దార్ భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.రెవెన్యూ సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠినచర్యలు



రాయితీ ఎరువులు అందజేస్తున్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్

ఉట్నూర్‌రూరల్: నకిలీ ఎరువులు, విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ హెచ్చరించారు. మండలంలోని చెక్‌పోస్టు కొత్తగూడెంలో ప్రభుత్వం అందిస్తున్న రాయితీ పెసర, కందుల విత్తనాలను మంగళవారం రైతులకు అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నాణ్యమైన విత్తనాలు, ఎరువులు షాపుల్లో రైతులకు సరిపడా అందుబాటులో ఉండేలా చూడాలని వ్యవసాయ అధికారులకు సూచించారు. ఏవో రమేశ్, శాస్త్రవేత్త ప్రవీణ్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ జైవంతరావు, నాయకులు ఖయ్యుం, చంద్రయ్య, ప్రభాకర్, మహేందర్, రైతులు తదితరులు ఉన్నారు.

వివాహిత అదృశ్యం

ఆదిలాబాద్‌రూరల్: మావల పోలీసుస్టేషన్ పరిధి కేఆర్కే కాలనీలో వివాహిత అదృశ్యమైనట్లు సీఐ కర్రె స్వామి తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన దంపతులు కేఆర్కే కాలనీలో ఉంటున్నారు. భర్త డ్రైవర్ పనిచేస్తుండగా భార్య ఓ హోటల్‌లో పని చేస్తోంది. పనికి వెళ్తున్నానని చెప్పిన భార్య గతనెల 31న ఇంటి నుంచి వెళ్లి తిరిగిరాలేదు. భర్త ఫిర్యాదుతో మంగళవారం కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఇద్దరు పిల్లలతో తల్లి..

కేఆర్కే కాలనీలో తల్లితో పాటు ఇద్దరు పిల్లలు అదృశ్యమైనట్లు సీఐ కర్రె స్వామి తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. అదృశ్యమైన ఆమె పిల్లలతో తల్లిదండ్రుల వద్ద ఉంటుంది. భర్త దూరంగా ఉండడంతో ఆమె మానసికంగా ఇబ్బంది పడుతుంది. గతనెల 31న ఆమె ఇంటి నుంచి పిల్లలను తీసుకు వెళ్లింది. కుటుంబ సభ్యులు గాలించిన ఆచూకీ దొరకలేదు. మహిళ తల్లి ఫిర్యాదుతో మంగళవారం కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ముత్యాలమ్మ ఆలయంలో పూజలు

నేరడిగొండ: మండలంలోని వడూర్ గ్రామంలో ఇటీవల నూతనంగా నిర్మించిన ముత్యాలమ్మ ఆలయాన్ని మంగళవారం కాంగ్రెస్ బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్ సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు, వీడీసీ సభ్యులను ఆయన్ను సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆలయం వద్ద షెడ్డుతోపాటు సీసీ ప్లాట్‌ఫామ్ నిర్మాణం చేపడుతానన్నారు. గ్రామస్తులు, వీడీసీ సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

రామాలయ వివాదంపై విచారణ

కైలాస్‌నగర్: ఆదిలాబాద్‌లో మూతబడ్డ సీసీఐ సిమెంట్ ఫ్యాక్టరీ ఆవరణలో గల రామాలయంలోకి ప్రజల అనుమతి నిరాకరణపై నెలకొన్న వివాదంపై మంగళవారం విచారణ జరిగింది. ఇటీవల కాలనీవాసులు కలెక్టర్‌ను ప్రజావాణిలో కలిసి సమస్యను విన్నవించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్ కాలనీకి చేరుకుని అక్కడి పరిస్థితులను పరిశీలించారు. కాలనీవాసులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. సీసీఐ అధికారులు ఆలయంలోకి రాకుండా గేట్‌ను మూసివేస్తున్నారని పేర్కొంటూ కాలనీవాసులు ఆయనకు వినతిపత్రాన్ని అందజేశారు. విచారణ నివేదికను జిల్లా కలెక్టర్‌కు అందజేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

ట్రేడ్ లైసెన్స్‌లపై అవగాహన

కైలాస్‌నగర్: పట్టణంలో వ్యాపారాలు నిర్వహించే ప్రతి ఒక్కరూ విధిగా ట్రేడ్ లైసెన్స్‌లను కలిగి ఉండాలని బల్దియా అధికారులు పేర్కొన్నారు. వంద రోజుల కార్యచరణ ప్రణాళికలో భాగంగా మంగళవారం బంగారుగూడలో గల జంతు సంరక్షణ కేంద్రంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ఓల్డ్ బస్టాండ్ ఏరియాలోని పలు షాపులను సందర్శించి వారి ట్రేడ్ లైసెన్స్‌లను పరిశీలించారు. బల్దియా శానిటరీ ఇన్స్‌పెక్టర్లు శంకర్, నరేందర్, ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ కిరణ్ ఉన్నారు.

బేల: ప్రతి దుకాణదారుడు ట్రేడ్ లైసెన్స్‌లు రెన్యూవల్ చేసుకోవాలని పంచాయతీ కార్యదర్శి వేణుగోపాల్ పేర్కొన్నారు. మంగళవారం మండలకేంద్రంలోని చికెన్ సెంటర్‌లు, హోటళ్లు, విత్తన, ఎరువుల విక్రయ కేంద్రాల యాజమానులు, నిర్వాహకులకు ట్రేడ్ లైసెన్స్‌లు రెన్యూవల్‌కు నోటీసులు జారీ చేశారు. కారోబార్ కళ్యాణ్‌కార్ గజానన్ ఉన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

తలమడుగు: కజ్జర్ల గ్రామానికి చెందిన చింతలపల్లి సరిత, సకీనాపూర్‌కు చెందిన బత్తుల సూర్యప్రభకు మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను మాజీ జెడ్పీటీసీ గణేష్ రెడ్డి మంగళవారం అందజేశారు. మాజీ ఎంపీటీసీలు కమలాకర్, వెంకన్న యాదవ్, మాజీ సర్పంచులు మారుతి, గణేశ్ పాల్గొన్నారు.

విద్యార్థుల్లో ప్రతిభ వెలికితీతకు సమ్మర్ క్యాంప్

- ఉట్నూర్ ఏఎస్పీ కాజల్‌సింగ్



సర్టిఫికెట్లు అందుకున్న విద్యార్థులతో కాజల్‌సింగ్

ఇంద్రవెల్లి: విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభ వెలికితీతకు పోలీస్ సమ్మర్ క్యాంప్‌లు ఏర్పాటు చేసి క్రీడాపోటీలు నిర్వహించినట్లు ఉట్నూర్ ఏఎస్పీ కాజల్‌సింగ్ అన్నారు. పోలీస్ శాఖ ఆధ్వర్యంలో గతనెల 5 నుంచి 31 వరకు నిర్వహించిన సమ్మర్ క్యాంప్‌లో పాల్గొన్న 30 మంది విద్యార్థులను మంగళవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో పార్టీసిపెషన్ సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఏఎస్పీ మాట్లాడుతూ వేసవిసెలవుల్లో విద్యార్థుల కోసం సమ్మర్ క్యాంప్‌లు ఏర్పాటు చేసి వివిధ క్రీడా పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. ఉట్నూర్ సీఐ మొగిలి, ఎస్సై సాయన్న, కానిస్టేబుళ్లు సుజాత, చరణ్‌దాస్, దినేష్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

ఘనంగా భీమన్న పండుగ

సిరికొండ: మండల కేంద్రానికి చెందిన ముదిరాజ్‌లు మంగళవారం భీమన్న పండుగను ఘనంగా నిర్వహించారు. మహాలక్ష్మి, పోచమ్మ, భీమన్న దేవుడికి ప్రత్యేక పూజలు చేశారు.

ఆధార్ కేంద్రం ప్రారంభం

బేల: ఎంపీడీవో కార్యాలయ ప్రాంగణంలో ప్రత్యేక ఆధార్ సేవా కేంద్రాన్ని తహసీల్దార్ రఘునాథ్‌రావు ప్రారంభించారు. నిర్వాహకులు అమోల్ ఉన్నారు.

ఘనంగా అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణ

నేరడిగొండ: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చేసిన పోరాటం చిరస్మరణీయమని పలువురు ప్రముఖులు పేర్కొన్నారు. మండలంలోని తర్నం గ్రామంలో బీఆర్ అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. భారతీయ బౌద్ధమహా సభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రత్నాజాడే ప్రజ్ఞకుమార్, షెడ్యూల్డ్ కులాల హక్కుల పరిరక్షణ సంఘం జిల్లా కార్యదర్శి సుదర్శన్, బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు గజేందర్, లెక్చరర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బలరాం జాదవ్, అంబేద్కర్ విగ్రహ దాతలు జూలీ లింగన్న–లక్ష్మి దంపతులు, స్వామి, రాజారాం కానిందే, భీంరావు పాటిల్ పాల్గొన్నారు.

నాణ్యమైన విత్తనాలను ఎంచుకోవాలి

సిరికొండ: రైతులు నాణ్యమైన విత్తనాలను ఎంచుకోవాలని ఏవో శ్రద్ధారాణి అన్నారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో నాణ్యమైన విత్తనం –రైతన్నకు నేస్తంలో మంగళవారం ఆమె పాల్గొని పలు సూచనలు చేశారు. వ్యవసాయ పరిశోధన సంస్థ ద్వారా ఉత్పత్తి చేసిన విత్తన బ్యాగులను ముగ్గురు రైతులకు అందజేశారు. ఏఈవోలు ప్రవీణ్, దీపక్, రైతులు ఉన్నారు.

బోథ్: రైతులు నాణ్యమైన విత్తనాలను ఎంపిక చేసుకోవాలని బోథ్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి అన్నారు. మంగళవారం రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తున్న విత్తనాలను రైతులకు అందించారు. సొనాలలో కాంగ్రెస్ నాయకులు రైతులకు విత్తనాలను అందజేశారు.

ఇంద్రవెల్లి: వ్యవసాయ అధికారుల సూచనలు పాటించి రైతులు పంటలను సాగు చేసి అధిక దిగుబడి సాధించాలని కృషి విజ్ఞాన్ కేంద్రం శాస్త్రవేత్త డా.డి.మోహన్, ఇంద్రవెల్లి వ్యవసాయ అధికారి రాథోడ్ గణేశ్ అన్నారు. మండలకేంద్రంలోని రైతు వేదికలో మంగళవారం ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయానికి చెందిన వ్యవసాయ పరిశోధన స్థానాల్లో రూపొందించిన కొత్త వంగడాల రెడ్ గ్రామ్, గ్రీన్‌గ్రామ్ విత్తనాలను రైతులకు పంపిణీ చేశారు. ఏఎంసీ చైర్మన్ ముఖడే ఉత్తం, ఏఈవోలు కరుణ, వీర, సురేష్, నవతేజ్, లతాభారతి, వివేక్‌కుమార్ ఉన్నారు.

గుడిహత్నూర్: మండల కేంద్రంలోని వ్యవసాయ కార్యాలయంలో పలు గ్రామాలకు చెందిన రైతులకు కందులు, పెసర, విత్తన బ్యాగులను ఏవో రమేశ్ మంగళవారం పంపిణీ చేశారు. గుడిహత్నూర్, మన్నూర్ సహకార సంఘం చైర్మన్లు సంజీవ్ ముండే, ప్రకాశ్ కరాడ్, రైతులు పాల్గొన్నారు.

కుక్కల దాడిలో లేగదూడ మృతి

బజార్‌హత్నూర్: మండల కేంద్రంలో కృష్ణకు చెందిన లేగదూడపై సోమవారం అర్ధరాత్రి కుక్కలు దాడి చేయడంతో తీవ్ర గాయాలయ్యాయి. వైద్య చికిత్స కోసం రాత్రి పశువైద్యాధికారి ఫర్వేజ్ అహ్మద్‌ను సంప్రదించగా సిబ్బంది లేరని బాధితుడు తెలిపాడు. ప్రైవేటు వెటర్నరీ కాంపౌండర్ లేగదూడకు చికిత్స అందించగా మంగళవారం చికిత్స పొందుతూ మృతిచెందింది.

రాజ్‌గోండ్ ఉద్యోగులు ఐక్యంగా ఉండాలి

ఆదిలాబాద్‌రూరల్: జిల్లాలోని రాజ్‌గోండ్ ఉద్యోగులు ఐక్యంగా ఉండి సమస్యలు పరిష్కరించుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి ఆత్రం భాస్కర్ పేర్కొన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని పిట్టలవాడలో ఆదివాసీ భవనంలో ఆయన ఆధ్వర్యంలో రాజ్‌గోండ్ ఉద్యోగుల సంఘం జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మెస్రం శేఖర్, ప్రధాన కార్యదర్శిగా తొడసం పుల్లారావు, ఉపాధ్యక్షులుగా మెస్రం రవీందర్, కోవా నాగోరావు, తొడసం గోపాల్, గోడం త్రియాంబాక్‌రావు, సంయుక్త కార్యదర్శిగా ఆడ సంతోష్, మెస్రం బాదు, కోశాధికారిగా సోనేరావు, సాంస్కృతిక కార్యదర్శులుగా కుమ్ర సుమిత్ర, వెడ్మ లక్ష్మణ్, లాలుదేవ్ ఎన్నికయ్యారు. అనంతరం నూతనంగా ఎన్నికైన కారర్యవర్గ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. తర్వాత కార్యవర్గ సభ్యులను సన్మానించారు. నాయకులు గోద్రు, సిడాం వామన్ రావు, భీంరావు, దౌలత్ రావు, గుణవంత్‌రావు తదితరులు పాల్గొన్నారు.